

అతివకు అందలం

స్వయం ఉపాధి కల్పనతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

వివరాలు 8లో ▸



హామీల అమలుకు ఉద్యమించాలి

ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమించాలని సీపీ ఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు.

వివరాలు 8లో ▸



భువనగిరి అభివృద్ధికి కృషి

భువనగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

పత్తి విత్తు నేలపాలు!

నష్టం రూ.7కోట్లకుపైనే..
- మొలకెత్తక రైతుల దిగాలు
- ఇప్పటివరకు 80వేల ఎకరాల్లో సాగు
- ఇప్పటికే 2.20 లక్షల విత్తన ప్యాకెట్ల అమ్మకం
- భారీ వర్షాల్లేక పదును కరువు
- జిల్లాలో పరిస్థితిపై 'సాక్షి' పరిశీలన

పత్తి విత్తనం నేలపాలయ్యింది. భారీ వర్షాల్లేక నేలలో పదును కరువైంది. ఒక్కో రైతు రెండేసి సార్లు విత్తనం వేసినా.. మొలకెత్తడం లేదు. వర్షాలు తగినంతగా పడకపోతాయా? విత్తనం మొలవకపోతుందా? అనే రైతుల ఆశ ఆవిరైంది. జిల్లాలో ఇప్పటివరకు 80వేల ఎకరాల్లో పత్తి సాగులోకి వస్తే ఇందులో సుమారుగా 50శాతానికిపైగా సక్రమంగా మొలకెత్తక సుమారుగా రూ.7కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. -గజ్వేల్

ఆశావాహ దృక్పథంతో సాగు చేసిన పత్తి ఈసారి రైతులకు ఆదిలోనే కష్టాలు తెచ్చిపెట్టింది. పత్తిని సహజంగా రోహిణి కార్తె ఆరంభంలో వర్షాలు కురవకున్నా.. విత్తుకుంటారు. విత్తనం వేశాక కొద్ది రోజుల తర్వాత వర్షాలు కురవకపోతాయా.. అనే ఆశతో వేస్తుంటారు. కానీ ఈసారి పత్తి విషయంలో రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. ఒక్కో రైతు రెండేసిసార్లు విత్తనం వేసినా సరైన పదును లేక మొలకెత్తని పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో ఈసారి 5.50లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. ఇందులోభాగంగానే ప్రధాన పంటలైన వరి 3లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 60వేలు, కంది 10వేల ఎకరాల్లో సాగులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. పత్తి మాత్రం 1.80లక్షల ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు మొక్కజొన్న 30వేల ఎకరాల్లో సాగులోకి వస్తే.. పత్తి 80వేల ఎకరాల్లో సాగయ్యింది.

ఇప్పటికే సరిపడా విత్తన కొనుగోళ్లు..

జిల్లాలో 3.20లక్షల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉండగా, 2.20లక్షల విత్తన ప్యాకెట్ల కొనుగోళ్లు జరిగాయి. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఎకరాకు రెండు ప్యాకెట్ల చొప్పున వాడతారు. ఈ లెక్కన 1.10లక్షల ఎకరాల సరిపడా విత్తనం ఇప్పటికే అమ్మకాలు జరిగాయన్నమాట. ఇందులో ఇప్పటివరకు 80వేల ఎకరాలకుపైగా పత్తి సాగులోకి వచ్చిందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. నిజానికి సీజన్ ఆరంభం నుంచి ఇప్పటివరకు భారీ వర్షాలే లేవు. జూన్ నెలలో 104మి.మీల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 120మి.మీలకు మించి వర్షపాతం నమోదైందని వ్యవసాయశాఖ చెబుతున్నది.



కురవని భారీ వర్షాలు

ఇప్పటివరకు భారీ వర్షాలేమీ కురవలేదు. బొటాబొటీగా వానలు పడ్డాయి. చాలా చోట్ల నేల కూడా సక్రమంగా తడవలేదు. ఫలితంగా పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో రైతు రెండేసి సార్లు విత్తనం వేసినా ఫలితం లేకుండాపోయింది. జిల్లాలోని అన్ని చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రస్తుతం సాగులోకి వచ్చిన 80వేల ఎకరాల్లో సుమారుగా 40వేల ఎకరాల్లో విత్తనం మొలకెత్తలేదు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఎకరాకు రెండేసీ ప్యాకెట్లు లెక్కేసినా మొత్తంగా 80వేల ప్యాకెట్లకుపైగా విత్తనం నేలపాలైనట్లు స్పష్టమవుతోంది. ఒక్కో ప్యాకెట్ ధర రూ.864 చొప్పున లెక్కేస్తే సుమారుగా రూ.7కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా.

రెండుసార్లు విత్తినా మొలకెత్తలేదు..

పై ఫొటోలో ఉన్న రైతు పేరు జోడుముంతల మల్లయ్య. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామం. తనకున్న రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. రోహిణి కార్తె ఆరంభంలో కొద్దిపాటి వర్షం కురవడంతో నాలుగు పత్తి ప్యాకెట్ల విత్తనాలు వేశాడు. ఒక్కో ప్యాకెట్ ధర రూ.864 చొప్పున లెక్కిస్తే.. రూ.3,456 ఖర్చు చేశాడు. వర్షాలు పత్తా లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో చెడగొట్టి పదిహేను రోజుల క్రితం మళ్లీ రూ.3,456 వెచ్చించి పత్తి విత్తాడు. అది కూడా నేటికీ మొలకరావడం లేదు. ఇవీ కాకుండా దున్నకాలు, ఇతర పెట్టుబడి ఖర్చు మరో రూ.10వేలపైనే అయ్యిందని మల్లయ్య చెబుతున్నాడు. ఇదీ జిల్లాలోని దాదాపు అందరి పత్తి రైతుల దుస్థితి. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు.

రెండున్నర ఎకరాల్లో వేశా..



రెండున్నర ఎకరాల్లో 25రోజుల క్రితం వేసిన పత్తి విత్తనం ఇంకా మొలకెత్తలేదు. సుమారు ఆరు ప్యాకెట్ల విత్తనాలు నేల పాలయ్యాయి. ఇందుకోసం రూ.5,200 ఖర్చు చేశా. కొద్దిపాటి వర్షం కూడా పడకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలే.

– రాజబోయిన రమేశ్, పత్తి రైతు, గంగాపూర్, మర్కూక్

పరిశీలన చేస్తున్నాం



జిల్లాలో సాధారణ వర్షపాతానికి మించి వర్షపాతం నమోదయ్యింది. కానీ అన్ని చోట్ల ఒకరకంగా కురవలేదు. ఇప్పటివరకు 80వేల ఎకరాల్లో పత్తి సాగులోకి వచ్చింది. వర్షాలు కురవని చోట పత్తి విత్తనాలు మొలకెత్తలేదని చెబుతున్నారు. పరిశీలన జరుపుతున్నాం. భారీ వర్షాలు కురుస్తాయనే ఆశాభావం ఉంది.

– మహేశ్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

మల్లన్నకు పూజలు.. జోరుగా పట్నాలు



గంగిరేణి చెట్టు వద్ద భక్తుల సందడి



పట్నాలు వేసి భక్తుల మొక్కులు

కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామివారికి అభిషేకాలు, పట్నాలు, ఒడిబియ్యం, అర్చనలు, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కొండపై రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి చల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. వేద పాఠశాలలో ఆలయ అధికారులు ప్రవేశ పరీక్ష నిర్వహించగా 22 మంది విద్యార్థులు హాజరయ్యారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)

నాచగిరిలో భక్తుల సందడి



స్వామి సన్నిధిలో భక్తులు

ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలాచరించి గర్భగుడిలో కొలువైన లక్ష్మీనారసింహులను దర్శించుకుని తరించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్షేత్రంలో 13 సత్యనారాయణస్వామి వ్రతాలు, 9 నిజాభిషేకాలు, 3 కల్యాణాలు జరిగినట్లు ఈఓ పేర్కొన్నారు.

– వర్గల్(గజ్వేల్)

న్యూస్‌రీల్

నేటి నుంచి కొత్త చట్టాల అమలు

సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్: భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు సీపీ అనురాధ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా నూతన చట్టాలు దేశ శాంతి భద్రతల పరిరక్షణలో ఒక మైలురాయని తెలిపారు. ఈ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయన్నారు. చట్టాలపై అవగాహన కోసం పోలీసు అధికారులు, సిబ్బందికి నెల రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కొత్త చట్టాలతో మరింత సమర్థంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. పోలీస్ అధికారులు నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రగతి చక్ర అవార్డుల ప్రదానం



అవార్డులు ప్రదానం చేస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు ఆదివారం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేశారు. ఉద్యోగుల పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులు అంకిత భావంతో నిర్వహించి డిపో అభివృద్ధికి పాటుపడాలన్నారు. మే–2024 మాసంలో బెస్ట్ ఈపీకే, బెస్ట్ కేఎంపీఎల్ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ డి.శ్రీధర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ సమ్మయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

'డివిజనల్ అకౌంట్స్' పరీక్షలు ప్రారంభం



అభ్యర్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: పొన్నాల శివారు ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షను ఆన్‌లైన్ విధానంలో రెండు పేపర్లుగా నిర్వహించారు. ఉదయం10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన పేపర్–1 పరీక్షకు 100 మందికి 60 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పేపర్–2 పరీక్షకు 100 మందికి 60 మంది హాజరయ్యారు. రోజుకు రెండు సెషన్ల పాటు జూన్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నవీన్, టీసీఎస్ ఆఫీసర్ పృథ్వీరాజ్, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా తదితరులు పర్యవేక్షించారు.

రైతుల నిర్ణయం మేరకే రైతు భరోసా..



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ మహేశ్

హుస్నాబాద్‌రూరల్: రైతుల నిర్ణయం మేరకే ప్రభుత్వం రైతు భరోసా పథకం విధి విధానాలను రూపొందిస్తోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేశ్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ విశాల పరపతి సహకార సంఘం నిర్వహించిన మహాజన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా పథకం ప్రవేశపెట్టి ఎకరాకు ఏటా రూ.15 వేల పెట్టుబడి సహాయం చేయనున్నట్లు చెప్పారు. రైతు భరోసా పథకం ఎవరికి ఇవ్వాలి? ఎంత భూమి ఉన్న వారికి ఇవ్వాలి? అందరికీ ఇవ్వాలా? అనే సందేహాలు పలువురు వ్యక్తం చేయడంతో సాగు చేసే రైతులకే అందేలా ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయలను సేకరిస్తున్నట్లు చెప్పారు.

రైతుల ప్రయోజనాలే ముఖ్యం

పంట రుణమాఫీ చరిత్రాత్మకం
- డీసీసీబీ ద్వారా రూ.451 కోట్ల రుణాలు మాఫీ
- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా పంట రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకమని ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా చెరగని ముద్రవేసుకున్నారని తెలిపారు. ఆదివారం ఆయన వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రాన్ని కుటుంబసమేతంగా సందర్శించారు. అమ్మవారి సన్నిధిలో తన మనవడు విరాజ్‌రెడ్డికి అన్నప్రాసన జరిపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న రూ.2లక్షల పంట రుణమాఫీ నిర్ణయంతో డీసీసీబీ ద్వారా రూ.451 కోట్ల పంట రుణాలు మాఫీ కానున్నాయన్నారు. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 57,585 మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాగానే ఆయా రైతులకు రూ.450 కోట్ల రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. డీసీసీబీ ద్వారా మండల కేంద్రాల్లో ఇళ్ల నిర్మించుకునే రైతులకు రూ.40 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మించుకునే రైతులకు రూ.15 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.75 లక్షలు రుణం ఇస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా తాము సేవలందిస్తున్నామని, చిరు వ్యాపారాలు, మహిళా సంఘాలకు రుణాలు, వాహనాల కొనుగోలు, ఉన్నత చదువుల కోసం రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 శాఖల ద్వారా సేవలు విస్తరింపజేశామని, రూ. 600 కోట్లు పైగా డిపాజిట్లు సేకరించామని స్పష్టం చేశారు.



వర్గల్ అమ్మవారి సన్నిధిలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి దంపతులు

జిల్లా పాఠశాలలకు గుర్తింపు

- 'హార్బింగర్స్ ఆఫ్ ఛేంజ్'లో ప్రచురణ
- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వినూత్న బోధనలో పలు పాఠశాలలకు గుర్తింపు వచ్చింది. ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో రూపొందించిన 'హార్బింగర్స్ ఆఫ్ ఛేంజ్' (మార్పు ప్రధాతలు) మేగజైన్‌లో జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు చోటు లభించింది. ఇందుకు సంబంధించిన వివరాలు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి భాస్కర్‌లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న బోధన, ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, పరిసరాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పాఠశాలల సక్సెస్ స్టోరీలు ప్రచురితమయ్యాయి. 2023–24 విద్యాసంవత్సరానికి గాను వివిధ రంగాల్లో రాణించిన పాఠశాలల సక్సెస్ స్టోరీ ఈ పుస్తకంలో ప్రచురించారన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి ప్రాథమిక పాఠశాల, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని నాంచర్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల, దుబ్బాక మండల పరిధిలోని లచ్చపేట ప్రాథమిక పాఠశాల, దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాల విజయ గాథలు ఈ పుస్తకంలో ప్రచురితమయ్యాయన్నారు.



మేగజైన్‌లో ప్రచురితమైన నాంచారుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల సక్సెస్ స్టోరీ


అవగాహన లేక.. అందుకోలేక!

- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో ఎన్నో పథకాలు
- వినియోగించుకోలేక పోతున్న విద్యార్థులు



మెదక్ కలెక్టరేట్: నిరుపేదలైన ఎస్సీ విద్యార్థులకు ఉన్నత విద్యనందించి ఉన్నత శిఖరాలకు చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. కానీ పథకాలపై అవగాహన కల్పించేవారు లేక విద్యార్థులు వాటిని అందుకోలేక పోతున్నారు. కేవలం రిజర్వేషన్లు, ఎస్సీ కార్పొరేషన్ రుణాల గురించి తప్ప.. చదువుకు సంబంధించి సంక్షేమ పథకాల ఉన్నాయని చాలా మందికి తెలియడం లేదు. వారికి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు.

స్టడీ సర్కిల్స్



గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత కోచింగ్ కోసం స్టడీ సర్కిళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో ఎలా చేరాలి.. ఎక్కడ అందుబాటులో ఉన్నాయి..? వంటి విషయాలు తెలియని ఎంతో మంది నిరుపేదలైన ఎస్సీ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం లేదు.

ఎస్సీ అడ్వకేట్స్ స్కీం

న్యాయవాద వృత్తిని ఎంచుకొని లా పట్టభద్రులైన ఎస్సీలకు మూడేళ్ల పాటు అనుభవజ్ఞులైన న్యాయవాదుల వద్ద శిక్షణ పొందడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఈ పథకంలో ఎంపికైన అభ్యర్థులకు మూడేళ్ల పాటు నెలకు రూ.3 వేలు, వన్‌టైం గ్రాంట్ కింద రూ.50 వేలతో పాటు బార్ కౌన్సిల్ అడ్మిషన్ ఫీజు సైతం చెల్లిస్తోంది. ఈ పథకానికి జిల్లాలో గతంలో ఒకరిద్దరూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు ఒక్కరూ కూడా దరఖాస్తు చేసుకోలేదు.

సీసీఎస్ (కార్పొరేట్ కాలేజీ స్కీం)

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తారు. ఈ పథకం కింద ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండియర్‌తో పాటు ఎంసెట్‌కు సైతం శిక్షణ ఇస్తారు. ఇందులో విద్యార్థులకు ఉచితంగా హాస్టల్, భోజనం, బుక్స్ అందిస్తారు. ఈ ఏడాది 40 మందికి అవకాశం ఉండగా 27 మంది మాత్రమే ముందుకు వచ్చారు.

బుక్ బ్యాంక్ పథకం



ప్రొఫెషనల్ కోర్సులు చదివే ఎస్సీ విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మెడికల్, డెంటల్, వైద్య, ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, ఆయుర్వేదిక్, హోమియోపతి, పాలిటెక్నిక్, బీఈడీ విద్యార్థులకు పుస్తకాలు అందిస్తారు.

బెస్ట్ అవైలబుల్

నిరుపేదలైన ఎస్సీ విద్యార్థులకు జిల్లాలో ఉన్నత ప్రమాణాలు గల ప్రైవేట్ పాఠశాలల ద్వారా కార్పొరేట్ విద్యను అందించడమే ఈ పథకం లక్ష్యం. 1వ తరగతి, 4వ తరగతి పూర్తి చేసిన వారికి అర్హత కల్పిస్తారు. ఇటీవలే ఈ పథకానికి ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పాలి.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్

హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఎస్సీ విద్యార్థులకు అడ్మిషన్స్ కల్పించడం ద్వారా వారికి నాణ్యమైన విద్య అందజేయాలని ప్రభుత్వ ఉద్దేశం. ప్రతి ఏడాది లాటరీ పద్ధతి ద్వారా ఈ పాఠశాలకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాభ్యాసం కల్పిస్తారు. విద్యార్థి తరగతిని బట్టి రూ.90 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఫీజును సంస్థకు ఎస్సీ అభివృద్ధి శాఖ అందజేస్తుంది.

ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్స్

నిరుపేద ఎస్సీ విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా విద్యనభ్యసించి అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ప్రీ– మెట్రిక్ స్కాలర్‌షిప్స్ అందజేస్తుంది. ఈ పథకం కింద 5 నుంచి 8వ తరగతి వరకు చదివే నిరుపద ఎస్సీ విద్యార్థుల (బాలుర)కు నెలకు రూ. 100 చొప్పున 10 నెలలకు ఒక్కొక్కరికి రూ.1000, బాలికలకు 1,500ల చొప్పున అందజేస్తుంది. 9, 10వ తరగతుల వారికి రూ. 3 వేలు చెల్లిస్తారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి



ఈ పథకం ద్వారా అర్హులైన ఎస్సీ అభ్యర్థులకు ప్రపంచంలోని పది దేశాల్లో గల పది గుర్తింపు పొందిన యూనివర్సిటీల్లో ఉన్నత విద్యనభ్యసించే అవకాశం ఉంది. రాష్ట్రస్థాయి కమిటీ ద్వారా ప్రతి ఆరు నెలలకోసారి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో అభ్యర్థికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. ఇందుకోసం శిక్షణ సైతం ఇస్తారు.

పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు

జిల్లాలో మొత్తం 4 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. ప్రొఫెషనల్ కోర్సులు చదివే బాలురకు (2), బాలికలకు (2) హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో వందమంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ చదివే విద్యార్థులు ఇందులో చేరవచ్చు. ఈ హాస్టల్‌లో ఉంటూ సమీపంలోని కళాశాలల్లో చదువుకోవచ్చు. అలాగే నెలకు రూ.500ల పాకెట్ మనీ కూడా ఇస్తారు. వీటితో పాటు సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. అయితే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వాలు వాటిపై అవగాహన కల్పించడం లేదని.. ఫలితంగా ఆశించిన స్థాయిలో ఎస్సీలు అభివృద్ధి చెందడం లేదని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

రైతు భరోసా కింద ప్రభుత్వం చేయూత

జిల్లా సహకార అధికారి ప్రసాద్



రైతు భరోసాపై అభిప్రాయాలు తీసుకుంటున్న తుమ్మ ప్రసాద్

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద చేయూత అందిస్తుందని జిల్లా సహకార అధికారి(డీసీఓ) తుమ్మ ప్రసాద్ అన్నారు. ఆదివారం సిర్గాపూర్ మండలం బోక్కస్‌గాం పీఏసీఎస్‌లో డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకం కోసం అభిప్రాయలు తీసుకున్నారు. 10 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా పథకం ఇవ్వాలని పలువురు రైతులు సూచనలు చేశారు. అనంతరం వెంకట్రాములు మాట్లాడుతూ.. పీఏసీఎస్ పరిధిలోని రైతుల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. బాచేపల్లి, బీబీపేట పీఏసీఎస్‌ల్లో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీసీఓ చిన్నారావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, సీఈఓ సతీష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో..

ఎస్జీటీలకు న్యాయం చేయండి

మెదక్ కలెక్టరేట్: ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్జీటీలకు అన్యాయం జరుగుతుందని, అనధికారిక రేషనలైజేషన్ ఆపాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు సబ్బని శ్రీనివాస్, సుంకరి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఇప్పుడు జరుగుతున్న ఎస్జీటీ కేడర్ బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో చాలా పాఠశాలల్లో ఖాళీలు చూపించడం లేదని తెలిపారు. ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాల మూతబడనీయమని, ఒక్క విద్యార్థి లేనటువంటి పాఠశాలలను కూడా తెరవాలని, అలాంటి వాటిలో ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పని చేయడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం బదిలీల్లో ఆయా ఖాళీలు చూపించకుండా కనిపించకుండా రేషనలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. ఈ అనధికారిక రేషనలైజేషన్ ప్రక్రియను వెంటనే విరమించుకొని జిల్లాలోని అన్ని ఖాళీలను జాబితాలో చూపించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర జిల్లా బాధ్యులు వెంకట్రాంరెడ్డి, ఎల్.మల్లారెడ్డి, తాళ్ల శ్రీనివాస్, ఇమ్మడి సంతోష్ కుమార్, సతీష్ రావు, శిరేగే చంద్రశేఖర్, రామకృష్ణ, అజయ్ గౌడ్, పంతులు రాజు, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను చూపించాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను వెబ్ ఆప్షన్‌లో చూపాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిడ్డి ఎల్లం చల్లా లక్ష్మణ్ అన్నారు. చేగుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్‌జీటీ క్యాడర్ బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను వెబ్‌లో చూపించడం లేదన్నారు. ఈ అంశం అనధికారిక రేషనలైజేషన్ కిందకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. భవిషత్‌లో మారుమూల గ్రామాల పాఠశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. ఒక్క పాఠశాలను కూడా మూసి వేయమని చెప్పిన ప్రభుత్వం మాట నిలుపుకోవాలని లేదంటే తపస్ ఉపాధ్యాయ సంఘం తరపున పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

పోలీసులమని చెప్పి..

పట్టపగలే దారి దోపిడీ

నర్సాపూర్: పట్టపగలు ప్రధాన రహదారి వెంట కాలినడకన వెళ్తున్న వ్యక్తిని ఇద్దరు దుండగులు అడ్డుకొని దోపిడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నంగునూర్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన చిత్తారి శర్మ నర్సాపూర్‌లోని బంధువుల ఇంటికి బస్సులో వచ్చారు. బస్సు దిగి ప్రధాన రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు దుండగులు వచ్చి తాము పోలీసులమని చెప్పి అడ్డుకున్నారు. ఇందులో ఒకరు చిత్తారి శర్మను పట్టుకోగా, మరో వ్యక్తి అతడి మెడలోని ఒకటిన్నర తులం బంగారు గొలుసు, అరతులం బంగారు ఉంగరం తీసుకొని పారిపోయారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు.

అతివకు అందలం

స్వయం ఉపాధి కల్పనతో గ్రామాల అభివృద్ధిలో మహిళలను భాగస్వాములు చేయడంతోపాటు వారు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. 'మహిళా శక్తి' కార్యక్రమం చేపట్టి 14 రకాల పనులను కల్పించడానికి ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. మహిళలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా ఒక్కొక్కరికి అధికారులు రుణాలు ఇప్పించనున్నారు.

– హుస్నాబాద్‌రూరల్

'మహిళా' శక్తి కింద 14 రకాల యూనిట్లు

- ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రోత్సాహం
- మహిళా సంఘాలతో అధికారులు సమావేశం
- ఊరికి ఒక యూనిట్ ఏర్పాటుపై కసరత్తు
- స్వయం ఉపాధికి బ్యాంకు, స్త్రీనిధి రుణాలు



టైలరింగ్ చేస్తున్న మహిళలు

జిల్లాలోని 18, 267 స్వశక్తి సంఘాల్లోని 1,94,210 సభ్యులకు స్వయం ఉపాధి కల్పించే యూనిట్లను ఏర్పాటు చేయించి వారికి నెల నెలా ఆదాయం సమకూరే మార్గాలను చూపించనున్నారు. హుస్నాబాద్ పట్టణంలో మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతోపాటు మహ్మదాపూర్, రాములపల్లి, పొట్లపల్లి గ్రామాలకు మీ సేవా కేంద్రాలను మంజూరు చేయించారు. మహిళా శక్తి కార్యక్రమంలో 14 రకాల యూనిట్లు టైలరింగ్, డెయిరీ యూనిట్లు, పౌల్ట్రీ, మొబైల్ చేపల వ్యాపారం, క్యాంటీన్లు, ప్లాస్టిక్ మేనేజమెంట్, సోలార్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, కస్టమర్ హైరింగ్ సెంటర్, మ్యాన్ ఫ్యాక్చరింగ్, కోడి పిల్లల పెంపకం యూనిట్లను మహిళలతో ఏర్పాటు చేయించడానికి చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడూ అవగాహన కల్పిస్తున్నారు. జూలై నెలలో మహిళలను గుర్తించి వారితో ఆగస్టులో స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేయించడానికి డీఆర్‌డీఏ అధికారులు సిద్ధమవుతున్నారు.

పెళ్లి బాజాలు మోగించే బాధ్యత..

మహిళా సంఘాలకు ఇప్పటికే స్కూల్ విద్యార్థుల దుస్తులను కుట్టే పని అప్పగించారు. అలాగే మహిళా క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాలతోపాటు పెళ్లి బాజాలు మోగించే బాధ్యతలను కూడా అప్పగించడానికి గ్రామాల వారీగా ఆసక్తి గల మహిళ స్వశక్తి సంఘాలకు అవగాహన కల్పిస్తున్నారు. 21 మంది మహిళలతో ఒక గ్రూపు ఏర్పాటు చేయించి వీరి ద్వారానే పెళ్లికి కావాల్సిన బ్యాండ్, టెంట్ సామగ్రితోపాటు పెళ్లి చేసే పురోహితుడిని కూడా ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు.

పాల ఉత్పత్తిలో మహిళలు..

హుస్నాబాద్ నియోజకవర్గంలో మూల్కనూర్ మహిళా స్వకృషి డెయిరీ ఉండటంతో మహిళలను పాల ఉత్పత్తిలో ప్రోత్సహించాలని హుస్నాబాద్‌కు 84 యూనిట్లు, అక్కన్నపేటకు 140 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించారు. ఒక పాడి పశువుకు రూ.90 వేలు, ఒక యూనిట్‌లో రెండు పాడి పశువులను అందిస్తారు. డెయిరీ యూనిట్లు ఎంపిక చేసుకున్న మహిళలు మేలు రకం పాడి పశువులను కొనుగోలు చేయడానికి ఇతర రాష్ట్రాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయానికి అనుబంధంగా పాల ఉత్పత్తి చేస్తే రైతు కుటుంబాలకు పంటలతోపాటు నెల నెల పాలతో ఆదాయం పొందాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

రూ.2.50 లక్షల వరకు రుణాలు



ప్రభుత్వం మహిళలను లక్షాధికారులను చేయడానికి మహిళా శక్తి కార్యక్రమంలో 14 రకాల యూనిట్లను ప్రతిపాదించింది. అందులో మీ సేవా కేంద్రాలు, క్యాంటీన్లు, డెయిరీ ఫామ్‌లను ఏర్పాటు చేయడానికి బ్యాంకు, స్త్రీనిధి నుంచి రూ.2.50 లక్షల వరకు రుణాలను ఇప్పిస్తుంది. హుస్నాబాద్‌లో మహిళా క్యాంటీన్ నిర్వహణకు మున్సిపల్ కాంప్లెక్స్‌లో రెండు షెటర్లు పీడీ జయదేవ్ ఆర్య పరిశీలించారు. పోతారం (ఎస్)లో టైలరింగ్ యూనిట్ నడుస్తుంది. పెళ్లిల నిర్వహణ కూడా మహిళ సంఘాలకు అప్పగించాలని 21 మందితో ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేస్తున్నాం.

– శ్రీనివాస్, ఏపీఎం ,హుస్నాబాద్

మా ఆత్మకు శాంతి చేకూరాలంటే..

- మా దగ్గర తీసుకున్న డబ్బులు పిల్లలకు ఇచ్చేయండి
- ధూళ్మిట్ట గ్రామంలో పోస్టర్లు



గ్రామంలో ఏర్పాటు చేసిన పోస్టర్

మద్దూరు(హుస్నాబాద్): మా ఆత్మకు శాంతి చేకూరాలంటే మా కిరాణా షాపులో అరువు తీసుకున్న, మా దగ్గర చేబదులు తీసుకున్న డబ్బులు మా పిల్లలకు ఇవ్వాలని ఓ గ్రామంలో వెలిసిన పోస్టర్‌లు అందరినీ ఆలోచింప చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా ధూళ్మిట్ట మండల కేంద్రానికి చెందిన తాడూరి కరుణాకర్, అతడి భార్య దివ్య గ్రామంలో తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో సాగు చేసుకుంటూ చిన్నపాటి కిరాణా షాపు నడుపుకునేవారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 2020 జూన్ 2న విద్యుదాఘాతంతో కరుణాకర్ మృతి చెందాడు. భర్త మరణంతో దివ్య అనారోగ్యానికి గురై 2024 ఏప్రిల్ 2న మృతి చెందింది. దీంతో కరుణాకర్ తల్లిదండ్రులు తాడూరి భారతమ్మ, నర్సయ్య, సోదరుడు స్వామిలు గ్రామంలో ఫ్లెక్సీలు వేయించారు. "తమ కిరాణా షాపులో అరువు తీసుకున్నవారు, తమ వద్ద తీసుకున్న అప్పులు తమ పిల్లలకు ఇవ్వాలని, అప్పుడే తమ మా ఆత్మకు శాంతి చేకూరుతుందని" కరుణాకర్, దివ్యలు విన్నవించినట్లు పోస్టర్‌లలో ఉంది. ఈ పోస్టర్‌లను చూసిన గ్రామస్తులు కరుణాకర్, దివ్యల వద్ద అరువు, బాకీలు తీసుకున్న వారు పిల్లలకు ఇచ్చి ఆదుకోవాలని మాట్లాడుకుంటున్నారు.

హామీల అమలుకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్

కొమురవెల్లి(సిద్దిపేట): ఎన్నికల సమయంలో ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు కార్యకర్తలు, నాయకులు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్‌లో ప్రారంభమైన రెండు రోజుల శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయని, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. మోదీ బొగ్గు గనులను వేలం వేసి దేశ సంపదను ప్రైవేట్‌కు తాకట్టు పెట్టడమేనని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మహిళలకు రూ.2,500, వ్యవసాయ కూలీలకు రూ.12,000, రైతు భరోసా లాంటి అనేక హామీలు నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎల్లయ్య, భాస్కర్, బద్దిపడగా కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

మృతదేహంతో ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కుటుంబీకులు

వట్‌పల్లి(అందోల్): మురికి కాల్వలో పూడికతీత తీస్తూ ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందిన పంచాయతీ కార్మికుడు జంగంపేట ప్రకాశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఆదివారం అందోలు మండల పరిధిలోని చింతకుంట రహదారిపై మృతదేహంతో కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు నిర్వహిస్తూ చనిపోయి 24 గంటలు గడుస్తున్నా ప్రభుత్వ పరంగా అధికారులెవరూ రాకపోవడం దుర్మార్గమన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎస్సై అరుణ్ కుమార్ గౌడ్ అక్కడికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి అధికారులు వస్తే గాని తాము ఇక్కడి నుంచి వెళ్లమని భీష్మించి కూర్చున్నారు. సూపరింటెండెంట్ అశోక్ ధర్నా స్థలానికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, అంత్యక్రియలు నిమిత్తం రూ.50 వేలు, ఇన్సూరెన్స్, పంచాయతీ తరపున ఆర్థిక సాయం అందించాలని వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు.

స్కూల్‌కి వెళ్లమని మందలించడంతో..

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

పటాన్‌చెరు టౌన్: తల్లి స్కూల్‌కి వెళ్లమని మందలించడంతో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. జహీరాబాద్‌కు చెందిన స్వరూప పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. 29వ తేదీ ఉదయం స్కూల్ కి రెడీ కమ్మని రెండో కుమారుడు ఇమాన్యుల్ అలియాస్ బబ్లూని మందలించింది. దీంతో ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తల్లి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పనిపై బయటకు వెళ్లి వ్యక్తి..

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన రమేశ్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 29వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: కార్మికుల హక్కుల సంరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మల్లేశం పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవనంలో సీఐటీయూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేయక ముందే మతోన్మాదం, కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు రంగంలోకి దిగారని మండిపడ్డారు. కార్మికులను బలిపశువులు చేస్తూ లేబర్ కోడ్‌లను అమలు చేస్తామనడం దుర్మార్గం అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, పోరాటాలను తీవ్రతరం చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 10న కార్మికుల కోర్కెలు దినం సందర్భంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బస్వరాజు, కోశాధికారి కె.నర్సమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు, సహాయ కార్యదర్శి బాలమణి, నాయకులు దాసు, ప్రవీణ్, శ్రీనాథ్, ముత్యం రాజు, సావిత్రి, యశోద, మంగ, వెంకట్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని కౌలాస్‌కోటను చూసేందుకు స్నేహితులతో కలిసొచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ కాలనీ చెందిన గంగిశెట్టి శ్రీకాంత్ స్నేహితులతో కలిసి కౌలాస్‌కోటను చూసేందుకు బైక్‌పై వచ్చాడు. కోటను సందర్శించిన అనంతరం తిరిగి స్వస్థలానికి వెళ్తుండగా పెద్దకొడప్‌గల్ మండలంలోని జగనాథ్‌పల్లి తండా సమీపంలోని 161వ నంబర్ జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, పోలీసులు బాధితుడిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ మేనమామ రంగవేణి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

మల్లన్న భక్తులపై దాడి

కొమురవెల్లి(సిద్దిపేట): గంజాయి మత్తులో మల్లన్న భక్తులపై దాడి చేసిన ఘటన కొమురవెల్లిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఆదివారం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన 9 మంది యువకులు మల్లికార్జున స్వామి దర్శనానికి శనివారం రాత్రి 11 గంటలకు వచ్చారు. అదే సమయంలో ఇండియా ప్రపంచ కప్ గెలవడంతో యువకులు కేరింతలతో ఆనందోత్సవాలు చేసుకుంటున్నారు. అప్పుడే కొమురవెల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు ఓ వాహనంలో గంజాయి మత్తులో అటుగా వెళ్తున్నారు. భక్తులు తమను చూసే ఎగతాళి చూస్తున్నారని వాహనంలోని దిగిన యువకుడు వారిపై కర్రలతో, ఇనుప రాడ్లతో దాడికి దిగారు. ఇందులో కరుణాకర్, కొలవం సాయి వెంకటేశ్, జశ్విన్ ముగ్గురికి గాయాలు అయ్యాయి. వెంటనే వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రంగు రాజు,పేర్ని శివమణి, దేశెట్టి నవీన్, పందుగ పవన్, దేశెట్టి వినయ్, సార్ల నవీన్,శ్రీకాంత్ అలియాస్ చింటూపై కేసు నమోదు చేసినట్లు చేర్యాల సీఐ శ్రీను తెలిపారు.

అంతర సాగు.. ఆదాయం బాగు

బోర్లపై వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవడానికి రైతులు ప్రత్యామ్నాయం వైపు చూస్తు న్నారు. పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం భారమైంది. దీంతో రైతులు అంతర పంటలపై దృష్టి సారించి ఆదాయ మార్గం మెరుగు పరుచుకుంటున్నారు. వాణిజ్య పంటల్లో అంతర పంటలుగా కంది, చిక్కుడు చేపట్టి రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలను కోల్పోవడం, గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో అంతర పంటలు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి.

- ఆసక్తి చూపుతున్న రైతులు
- శ్రమ తక్కువ.. భూసారం తగ్గదు
- రెండు పంటలు కలిసి వస్తే లాభాలే..
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సాధారణంగా చాలా మంది రైతులు ఒక సీజన్‌లో ఒకే పంటను మాత్రమే సాగు చేస్తుంటారు. అతి వృష్టి, అనావృష్టి చీడపీడల కారణంగా పంట దెబ్బతింటే పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో తమకున్న భూమిలో ఒకటి కన్న ఎక్కువ పంటలు సాగు చేసినప్పుడు ఒక పంట నష్టపోయినా మరో పంట దక్కే అవకాశం ఉంటుంది. ప్రధానంగా సమగ్ర సస్యరక్షణ చర్యల్లో అంతర పంటల సాగు ఎంతో మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి వసంతరావు సలహాలు, సూచనలు.

జాగ్రత్తలు తప్పనిసరి..

- నేలలోని పోషకాలను ఉపయోగించుకోవడంలో రెండు పంటల మధ్య పోటీ ఉండరాదు. ఆయా పంటల వేర్లు నేలల్లో వివిధ లోతులకు విస్తరించేలా ఉండాలి. వేర్వేరు కాల పరిమితులుండే పంటలను ముఖ్యంగా పప్పుజాతి పంటలను అంతర పంటలుగా సాగు చేస్తే అధిక ప్రయోజనం ఉంటుంది.
- మిత్ర పురుగులకు ఆశ్రయమిచ్చే పైర్లను అంతర పంటలుగా సాగు చేస్తే ఎంతో మేలు కలుగుతుంది. ఈ మిత్ర పురుగులు ప్రధాన పంటకు నష్టం కలిగించే చీడ పురుగులు ఉధృతిని ఆరికడుతాయి.
- చీడ పీడల తాకిడి క్రమాన్ని దృష్టిలో పెట్టుకొని పంటలను ఎంపిక చేసుకోవాలి. ఉదా: పత్తిలో పెసర, మినుము, సోయాచిక్కుడు లాంటి పంటలను అంతర పంటగా విత్తితే పత్తిని ఆశించే రసం పీల్చే పురుగులను తినే అక్షింతలు, సాలీళ్లు, అంతర పంటలపై వృద్ధి చెందుతాయి.
- ఇతర పంటల్లో కందికి ప్రత్యేకత ఉంది. దీని వేర్లు నేలలో లోతుకు చొచ్చుకుపోతాయి. భూమిలోని తేమను పోషకాలను లోపల పొరం నుంచి తీసుకుంటాయి. కంది దీర్ఘకాలిక (608) నెలల పంట, మొదటి రెండు మూడు నెలల్లో దీని పెరుగుదల నెమ్మదిగా ఉంటుంది. కనుక ప్రధాన పంటగా ఎదుగుతుంది. మెట్ట సేద్యంలో స్వల్ప కాలిక పంటలతో కందిని అంతర పంటగా విత్తడం వల్ల అధిక లాభాలుంటాయి.
- ప్రధాన పంటలకు అంతర పంటగా వచ్చే సమయంలో కనీసం 30 రోజుల అంతరం ఉండేలా పంటలను ఎంపిక చేసుకోవాలి.



మొక్కజొన్నలో అంతర పంటగా చిక్కుడు సాగు

ఉద్యాన పంటల్లో...

ఉద్యాన పంటల్లో మూడు నుంచి నాలుగేళ్ల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట ఎరువును ఎప్పుడైనా వాడుకోవచ్చు. అలాగే ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలను సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ కోతకు వచ్చే వరకు అంతర పంటలను అనుకూలంగా ఉంటుంది.

పత్తి పంటలో కంది సాగు

జిల్లా వ్యవసాయాధికారి సలహాలు..

మునిపల్లి(అందోల్): అంతర పంటలు తక్కువ కాల పరిమితి కాబట్టి మినప, పెసరతోపాటు పప్పు ధాన్యాలు, వేరు శనగ పంటలను వేసుకుంటే మేలు. కంది, జొన్న, మొక్కజొన్న, సజ్జలను కలిపి ఒక వరుస కంది, రెండు నుంచి నాలుగు వరుసల్లో అంతర పంటలు వేయాలి. ప్రస్తుతం రైతులు అంతర పంటలు కాకుండా పత్తి పంటపైనే మక్కువ చూపిస్తున్నారు. పత్తి పంట ఎక్కువ వేసినా నాలుగు సాళ్లకు ఒక కంది పంట సాలు వేయాలి. అంతర పంటలతోనే రైతులకు అధిక లాభమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అనుకూల నేలలు: మురుగు నీరు పోవడానికి వీలున్న అన్ని నేలలు అనుకూలం. చౌడు నేలలు పనికి రావు. కంది విత్తనాల్లో వివిధ రకాలు ఉంటాయి. ఖరీఫ్ సీజన్‌లో ఆయా విత్తనాలను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

విత్తనాలు నాటే దూరం: తేలికపాటి నేలలో ఖరీఫ్‌లో 20 సెంటీ మీటర్లు, నల్లరేగడి నేలలో 20 సెంటీ మీటర్లు, ఎర్ర నేలలో 10 సెంటి మీటర్లు విత్తనాలు విత్తాల్సి ఉంటుంది. నాగలి వెంబడి సాళ్లలో, గొర్రుతో విత్తనాలను నాటే అవకాశం ఉంది.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరానికి 2 టన్నుల చొప్పున వేసుకోవాలి. ఖరీఫ్‌లో 8 కిలోల నత్రజని 20 కిలోల భాస్వరం, యాసంగిలో అయితే 16 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం ఆఖరి దుక్కిలో వేసుకోవాల్సి ఉంటుంది.



పత్తి సాలులో కంది పంట (ఫైల్)

రెండు పంటలకు ఒకేసారి మందు



పత్తిలో కంది సాలు వేయడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. కంది పంటతో అధిక లాభం పొందవచ్చు. పత్తి పంటలో పురుగు నివారణ కోసం పిచికారీ మందును వేసిన సమయంలోనే అదే కంది పంటపై పిచికారీ మందు వేయడానికి అవకాశం ఉంటుంది. తిరిగి ఖర్చు కూడా ఎక్కువ రాదు.

–అశోక్, రైతు, పిల్లోడి గ్రామం

భూసారం పెరుగుతుంది



ఖరీఫ్‌లో కంది పంట వేసుకోవాలనుకునే రైతులు వేసవి దుక్కుల్లోనే జాగ్రత్తలు తీసుకోవాలి. లోతు దుక్కుల వల్ల పురుగులన్నీ బయట పడి, పక్షులు తింటాయి. దీంతో పురుగుల నివారణ సులభమవుతుంది. కంది సాగువల్ల భూసారం కూడా పెరుగుతుంది.

– అంబికా సోని, జిల్లా వ్యవసాయాధికారి